నేడు కులాంతర వివాహితుల రాష్ట్ర సదస్సు

సుందరయ్య విజ్ఞానకేంద్రం: ఈ నెల 29వ తేదీన కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఉదయం 11.30 గంటలకు బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో కులాంతర వివాహితుల రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు చెప్పారు. శనివారం బాగ్‌లింగంపల్లిలో రాష్ట్ర సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధా రాణి హాజరవుతారని తెలిపారు. కరపత్రం ఆవిష్కరణలో నగర కార్యదర్శి ఎం.దశరథ్, అడివయ్య, సుబ్బారావు, విజయ్, వీరభద్రం, రఘు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బర్కత్‌పురకు కేంద్ర మంత్రి రాక

కాచిగూడ: బర్కత్‌పురకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆదివారం రానున్నారు. బీజేపీ కార్యాలయంలో ఉదయం 10:30 గంటలకు జరిగే 'బయోగ్రఫీ ఆఫ్ ప్రైమ్ మినిస్టర్ నరేంద్రమోదీ' కార్యక్రమంలో పాల్గొనడానికి ఆయనతో పాటు రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ పాల్గొంటారని పార్టీ నేత కేశబోయిన శ్రీధర్ శనివారం తెలిపారు.

ప్రధాన రోడ్ల మరమ్మతులు చేపట్టాలి

అంబర్‌పేట: ప్రధాన రోడ్ల మరమ్మతులను వెంటనే చేపట్టాలని బాగ్ అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ బి.పద్మా వెంకట్‌రెడ్డి సూచించారు. శనివారం బాగ్ అంబర్‌పేట డివిజన్ అజాం కాంప్లెక్స్ సమీపంలో ఓ భారీ వాహనం వెళ్లే క్రమంలో రోడ్డు కుంగిపోయింది. దీంతో ఆ భారీ వాహనం అక్కడ పడిపోవడంతో స్థానికంగా రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న కార్పొరేటర్ ట్రాఫిక్ పోలీసులకు, ఇతర అధికార యంత్రాంగానికి సమాచారం ఇచ్చి భారీ వాహనాన్ని తొలగింపజేశారు. రోడ్డుపై ఏర్పడ్డ భారీ గొయ్యిని తక్షణమే పూడ్చాలని కోరారు. ఆమె వెంట పలువురు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలి

చిక్కడపల్లి: అఖిల భారత తెలుగు సాంస్కృతిక సమాఖ్య 24వ వార్షికోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందించిన వారు అవార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని సమాఖ్య జాతీయ కార్యదర్శి డాక్టర్ గణగ్ల విజయకుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్య, వైద్యం, సమాజసేవ, విధి నిర్వహణ, సాహిత్యం, నృత్యం, ఆధ్యాత్మికం, క్రీడ తదితర రంగాల్లో ప్రతిభ చూపిన వారికి ఆంధ్రరత్న,తెలంగాణ రత్న, బాలరత్న, స్టేట్ బెస్ట్ సిటిజన్, రాష్ట్ర స్థాయిలో అవార్డులు అందిస్తామని పేర్కొన్నారు. అత్యంత ప్రతిభ గల వారికి నేషనల్ బెస్ట్ సిటిజన్, విద్యారంగంలో విశిష్ట సేవలకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ పురస్కారాలను అక్టోబర్ 21న పలువురు రాజకీయ, సినీప్రముఖుల చేతుల మీదుగా ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ప్రతిభ గల వారు అక్టోబర్ 2లోగా 9391379903 నంబర్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

ముగిసిన క్రీడాపోటీలు

ముషీరాబాద్: ముషీరాబాద్‌లో 3 రోజులుగా కొనసాగిన ముషీరాబాద్ జోన్ ఇంటర్ స్కూల్ కబడ్డీ, ఖోఖో పోటీలు శనివారం ముగిశాయి. ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి హాజరై విజేతలకు మెమోంటో, సర్టిఫికేట్లు అందజేశారు. కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ లక్ష్మీనారాయణ, ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్, ముషీరాబాద్ డిప్యూటీ ఈవో చిరంజీవి, ఐవోఎస్ భారతీజయలక్ష్మి, ముషీరాబాద్ విద్యామండలి జోన్ కార్యదర్శి శ్రీలత, పీఈటీలు కిశోర్‌కుమార్, శ్రీనివాస్, సలావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సోలార్ ప్లాంట్‌కు మరమ్మతు

ముషీరాబాద్: భోలక్‌పూర్ ప్రభుత్వ బాలికల వసతి గృహంలో సోలార్ ప్లాంట్ పని చేయడం లేదని విద్యార్థులు రాజపేట చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఆర్.ఆంజనేయులు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందించి శనివారం మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు ఇబ్బందుల్లేకుండా తమ ట్రస్ట్ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు సుజాత, హేమారెడ్డి, హాస్టల్ వార్డెన్ భానుప్రియ పాల్గొన్నారు.

నియామకం

కాచిగూడ: తెలంగాణ ప్రాంత పద్మశాలీ సంఘం రాజకీయ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బొమ్మ ప్రవల్లికను నియమిస్తూ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి శనివారం నియామక పత్రాన్ని అందజేశారు. నారాయణగూడలోని పద్మశాలీ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాజకీయంగా మహిళలను చైతన్య పరుస్తానని తెలిపారు. కందగట్ల స్వామి, గడ్డం జగన్నాథం, రామచంద్రం,శివశంకర్, భిక్షపతి, దీపిక, అమరేందర్ పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులు త్వరగా పూర్తి చేయాలి

చిక్కడపల్లి: డ్రైనేజీ పైపులైన్ పనులు త్వరగా పూర్తి చేయాలని కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ అన్నారు. డివిజన్‌లో సుమారు రూ.21లక్షలతో నిర్మిస్తున్న పైపులైన్ పనులను వాటర్ వర్క్స్ డీజీఎం కార్తీక్‌రెడ్డి, సిబ్బందితో కలిసి శనివారం ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ సంయుక్త కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, నాయకులు ఓ.శ్రీకాంత్, మెతుకు ఉమేశ్, వడ్డపల్లి ఆనంద్‌రావు, బస్తీవాసులు కృష్ణనేత, వజ్రేశ్వర్, పెంటయ్య యాదవ్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

మా బతుకులను ఆగం చేయొద్దు

ప్రభుత్వానికి మూసీ పరీవాహక ప్రాంతవాసుల వేడుకోలు


గోల్నాక లంకబస్తీ

అంబర్‌పేట: వారంతా పేదలు.. పైసా పైసా కూడబెట్టుకొని చిన్న, చిన్న ఇళ్లు కట్టుకున్నారు.. ఇరుకు ఇళ్లలోనే జీవితాలు గడుపుతున్నారు. ఏళ్ల తరబడి జీవితాలతో రాజీ పడి బతుకుతున్నారు. ఇల్లు చిన్నదైనా పిల్లాపాపలతో కాలం వెళ్లదీస్తున్నారు. ఈ క్రమంలో ఉన్నట్టుండి.. 'నీ ఇల్లు తొలగిస్తాం'అంటూ ప్రభుత్వం మార్కింగ్ చేస్తే.. వారి జీవితాల్లో ఒక్కసారిగా అలజడి రేగింది. విలవిలాడిపోతున్నారు. ఆందోళనకు గురవుతున్నారు.. మా జీవితాలను ఆగం చేయొద్దని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. మూసీ అభివృద్ధి పేరిట అంబర్‌పేట నియోజకవర్గంలోని అంబర్‌పేట, హిమాయత్‌నగర్ మండలాల పరిధిలో సుమారు 1,154 నిర్మాణాలను తొలగిస్తామంటూ అధికారులు కొద్దిరోజులుగా ఇళ్లకు రెడ్ మార్కులు వేస్తున్నారు. అప్పటినుంచి గోల్నాక డివిజన్‌లోని న్యూ కమలానగర్, అంబేద్కర్ నగర్, లంకబస్తీలు, హిమాయత్‌నగర్ మండల పరిధిలోని కృష్ణనగర్, కాంగార్‌నగర్, సంజీవయ్యనగర్, హర్రాస్‌పెంట ప్రాంతాల్లో కొంత మంది నివాసాలు తొలగిస్తున్నట్లు ప్రభుత్వ యంత్రాంగం మార్కింగ్ చేసింది. దీంతో బాధితులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

ఉన్నపళంగా ఎక్కడికి వెళ్లాలి?



గత 20 ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నాం. ఈ ప్రాంతంతో మాకు వీడదీయరాని అనుబంధం ఉంది. ఎంత కష్టం వచ్చినా ఇక్కడే ఉంటున్నాం. ఇప్పటికిప్పుడు తొలగిస్తామంటూ మా బస్తీల్లో మార్కింగ్ చేయడం ఎంతవరకు న్యాయం. మమ్మల్ని కనీసం సంప్రదించకుండా కూల్చి వేస్తామని ప్రకటన చేయడంతో తీవ్రంగా భయందోళనకు గురువుతున్నాం.

– కవిత, కమాలనగర్

కష్టపడి కట్టుకున్నాం కూల్చేస్తామంటే ఎలా?



పైసా పైసా కూడబెట్టి సొంతింటి కలను నేరవేర్చుకున్నాం. మా సొంతింటి సంతోషాన్ని తీసేసుకుంటారా? మాకు ప్రభుత్వం ఇచ్చే డబుల్ బెడ్ రూం వద్దు. మాకు ఇక్కడే ఉపాధి ఉంది. మార్కింగ్ చేసిన అధికారులు మాకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. సంప్రదింపులు చేయలేదు. ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని పరిస్థితి ఉంది.

– పద్మ, గోల్నాక, లంకబస్తీ

మాజీ ప్రజాప్రతినిధుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలిగా సీతక్క


మంత్రి సీతక్కకు వినతి పత్రం అందజేస్తున్న మాజీ ప్రజాప్రతినిధుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

కవాడిగూడ: మాజీ ప్రజాప్రతినిధుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలుగా రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేడి శంకర్ తెలిపారు. ధర్నా చౌక్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ మాజీ సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ కౌన్సిలర్స్ ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ అత్యవసర సమావేశం నిర్వహించామన్నారు. అనంతరం మంత్రి సీతక్కను కలిసి గౌరవాధ్యక్షురాలి బాధ్యతను స్వీకరించాలని కోరగా ఆమె సానుకూలంగా స్పందించారని తెలిపారు. అలాగే తమకు పెన్షన్ సదుపాయం కల్పించి, హెల్త్ కార్డులు ఇప్పించాలని, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించాలని సీతక్కను కోరగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానని మంత్రి హామీనిచ్చారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు షిండే ఆనంద్‌రావు పటేల్, కాకునూరు మల్లికార్జున గౌడ్ పాల్గొన్నారు.

సీఎం ఇంటిని ముట్టడిస్తాం

కాచిగూడ: మూసీ నది పరీవాహక ప్రాంతాల్లో పేదల ఇళ్లను కూల్చివేస్తే వేలాది మందితో సీఎం రేవంత్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని దక్షిణ భారత రాజకీయ జేఏసీ చైర్మన్, ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ హెచ్చరించారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బహుజన రక్షణ సమితి (బీఆర్ఎస్) ఆవిర్భావ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని బీఆర్ఎస్ లోగోను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ. ప్రజలు జీవించే హక్కును సీఎం రేవంత్‌రెడ్డి కాలరాస్తున్నారని, భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. అగ్రవర్ణాలు ఆక్రమించిన ప్రాంతాలను ముట్టుకోకుండా కేవలం పేదల ఇళ్లను కూల్చడమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బహుజన రక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పొకాల డానియల్, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బావి ఆనంద్, అధికార ప్రతినిధి కాశి సతీష్ కుమార్, మహిళా విభాగం అధ్యక్షురాలు కొమ్ము స్వరూప, భాస్కర్ గౌడ్, గంగాధర్ యాదవ్, జావేద్ తదితరులు పాల్గొన్నారు.

దాండియా నైట్స్ పోస్టర్ ఆవిష్కరణ


దాండియా నైట్స్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దుండ్ర కుమారస్వామి తదితరులు

కాచిగూడ: దసరా నవరాత్రి వేడుకల్లో భాగంగా గురుకృష్ణా ఈవెంట్స్, ఈకే గ్రూపు సంయుక్త ఆధ్వర్యంలో శ్రీయాగ మహోత్సవం పేరిట 'హైదరాబాద్ బిగ్గెస్ట్ దాండియా నైట్స్' నిర్వహిస్తున్నారు. దాండియా నైట్ 2024 ఈవెంట్స్ పోస్టర్‌ను శనివారం కాచిగూడలో జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి ఆవిష్కరించారు. గచ్చిబౌలి స్టేడియంలో అక్టోబర్ 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు దాండియా నైట్స్ జరుగుతుందన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి వరద సహాయ నిధి కోసం ఈ దాండియా నైట్స్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఒక్కొక్క రోజు ఒక్కో విధమైన కార్యక్రమాలతో అందరినీ అలరించే విధంగా అట్రాక్టివ్ షాపింగ్ కౌంటర్స్, రుచికరమైన భోజన సదుపాయాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎంతో మంది సెలబ్రిటీస్, ఫేమస్ సింగర్స్ పాల్గొంటారని వెల్లడించారు. కార్యక్రమంలో డాక్టర్ వినయ్ కుమార్, కిరణ్, వెంకట్, రమణ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణకు వ్యతిరేకంగా రేపు రాష్ట్ర స్థాయి సదస్సు

కాచిగూడ: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ, క్రిమిలేయర్‌కు వ్యతిరేకంగా సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర స్థాయి సదస్సును నిర్వహిస్తున్నట్లు మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వీఎల్ రాజు అన్నారు. శనివారం నారాయణగూడలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్గీకరణకు వ్యతిరేకంగా రాజ్యాధికార సాధన కోసం పెద్ద ఎత్తున ఉద్యమాలు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర సదస్సుకు దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు,సుంప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూడి క్రిష్ణ స్వరూప్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తారని పేర్కొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

కాచిగూడ: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, సీసీ కెమెరాల వినియోగంపైనా అవగాహన పెంచుకోవాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. సీఏడీఆర్‌టీ ఆధ్వర్యంలో శనివారం కాచిగూడలోని బద్రుకా కళాశాల ఆడిటోరియంలో 'సైబర్ జెనస్' సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో డాటా సెక్యూరిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, నాస్కామ్ సీఈఓ డాక్టర్ బిరుదవోలు శ్రీరాం, టీబీసీఐటీ గవర్నింగ్ బాడీ చైర్మన్ పద్మశ్రీ డాక్టర్ టి.హనుమాన్ చౌదరి, బద్రుకా విద్యా సంస్థల కార్యదర్శి శ్రీకిషన్ బద్రుకా, డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ అభిరామకృష్ణ, డైరెక్టర్ డాక్టర్ డీవీఎస్ఎస్ మూర్తి, రిటైర్డ్ ఐపీఎస్ గోపీనాథ్ రెడ్డి, హైకోర్టు న్యాయవాది దీపక్ భట్టాచార్య, ప్రొఫెసర్ ఎంవీ రమణ మూర్తి, రిటైర్డ్ ఎస్పీ ఉత్కళం రామ్మోహన్, సీఏడీఆర్‌టీ వ్యవస్థాపకులు ఎన్.నర్సింహామూర్తి తదితరులు పాల్గొని ప్రసంగించారు. సైబర్ నేరాలతో ప్రతి రోజు ఎంతో మంది అమాయకులు మోసపోతున్నారని వివరించారు. ప్రజలను చైతన్య వంతులను

గుండె సంబంధిత వ్యాధులపై అవగాహన

ముషీరాబాద్: ప్రపంచ గుండె దినోత్సవాన్ని పురస్కరించుకుని ముషీరాబాద్ యూపీహెచ్‌సీలో శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మనోజ్‌రెడ్డి మాట్లాడుతూ సరైన ఆహారం తీసుకుంటూ ఒత్తిడికి దూరంగా ఉంటే రోగాలు దరిచేరవన్నారు. మద్యం, పొగాకుకు దూరంగా ఉండాలని, బీపీ, షుగర్, కొలెస్ట్రాల్ అదుపులో ఉంచుకోవాలని సూచించారు. గుండె సంబంధిత సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దని కోరారు. అనంతరం రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో భోలక్‌పూర్ యూపీహెచ్‌సీ పీహెచ్ఎన్ ఫెలిస్, ఏఎన్ఎంలు విజయకుమారి, సునీత, పద్మలత, శిరీషా తదితరులు ఉన్నారు.

నవంబర్ 3న నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలు

కాచిగూడ: జీవీఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నవంబర్ 3న కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో 19వ నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్–2024 పోటీలు నిర్వహిస్తున్నట్లు అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జీవీఎస్ గోపాల్ రెడ్డి తెలిపారు. శనివారం కాచిగూడలోని అకాడమీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీనియర్ అడ్వకేట్ అశోక్ ఆనంద్ కుమార్ నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి, డాక్టర్ విజయలక్ష్మి, ప్రొఫెసర్ ఉమా మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అసమానతలపై జాషువా అక్షర యుద్ధం

సుందరయ్య విజ్ఞానకేంద్రం: అసమానతలపై కలం ఝుళిపించిన మహనీయుడు మహాకవి గుర్రం జాషువా అని ఆవాస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.డి. అబ్బాస్ అన్నారు. శనివారం జాషువా జయంతి సందర్భంగా సుందరయ్య విజ్ఞానకేంద్రం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పేదరికం, అంటరానితనం ఆయనకు అనేక పాఠాలు నేర్పించాయని, ఈ రెండింటినీ ఏకకాలంలో రూపుమాపితేనే సామాజిక న్యాయం జరుగుతుందని భావించాడని అన్నారు. తెలంగాణ ప్రజాసాంస్కృతిక కేంద్రం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు, శోభన్‌నాయక్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి తరానికి స్ఫూర్తిగా అక్కినేని జీవితం

తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

చిక్కడపల్లి: ప్రముఖ నటుడు అక్కినేని నాగేశ్వర రావు జీవితం..నటన నేటి తరానికి స్ఫూర్తినిస్తాయని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి అన్నారు. త్యాగరాయ గానసభ ప్రధాన వేదికలో శనివారం రాత్రి సీల్ వెల్ కార్పొరేషన్, శ్రుతి లయ ఆర్ట్స్ అకాడమీ, ఆదర్శ ఫౌండేషన్, ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన చిన్నారెడ్డి మాట్లాడుతూ అక్కినేని నటజీవితం ఓ పాఠ్యగ్రంథం లాంటిదన్నారు. భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సీల్‌వెల్ శ్రుతిలయ అక్కినేని జీవన సాఫల్య పురస్కారాలు బైస దేవదాసు, వినాయక రావు, ఇమంది రామారావు, షరీఫ్, హనుమంత రావు, మణి, మహేష్‌లకు ప్రదానం చేశారు. అలాగే అక్కినేని మీడియా ఎక్సలెన్స్ అవార్డు–2024లను కూడా బహూకరించారు.

అభివృద్ధి పేరుతో అన్యాయం చేయొద్దు

● మూసీ బాధితుల కోసం పోరాడుతా ● ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్


నిర్వాసితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేష్


సమీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, అధికారులు

అంబర్‌పేట: మూసీ అభివృద్ధి పేరిట నియోజకవర్గంలోని పేద ప్రజలకు అన్యాయం చేయొద్దని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ప్రభుత్వాన్ని కోరారు. గోల్నాక డివిజన్ లంక బస్తీల్లో ఆయన శనివారం పర్యటించి మూసీ బాధితులతో మాట్లాడారు. బస్తీలోకి రాగానే నిర్వాసితులు గోడు వెళ్లబోసుకుంటూ కన్నీరుమున్నీరు అయ్యారు. ఈ ప్రాంతంతో ఉన్న అనుబంధాన్ని ఎమ్మెల్యేకు చెప్పుకుంటు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. న్యాయం జరిగేలా తన వంతు పోరాటం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ప్రభుత్వం కనీస అవగాహన, మానవత్వం లేకుండా వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

రూ.5.75 కోట్లతో ఆసుపత్రి కొత్త భవనం

అంబర్‌పేట: ప్రజలకు వైద్యాన్ని మరింత చేరువ చేసేందుకు చొరువ తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. శనివారం ఆసుపత్రి ప్రాంగణంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో పాటు ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబర్‌పేట డివిజన్ మున్సిపల్ కాలనీ ప్రభుత్వ కమ్యూనిటీలో ఉన్న ప్రభుత్వ ఆసుప్రతిని అన్ని హంగులతో కొత్త భవనాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. 30 పడకల ప్రసూతి ఆసుపత్రి నిర్మాణం కోసం రూ.5.75 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. 30 పడకల ఆసుపత్రి ఉన్నప్పటికీ తగిన సౌకర్యాలు లేవని, మరో కొత్త భవనం నిర్మాణానికి అనుమతులు తెచ్చామన్నారు. త్వరలో పనుల ప్రారంభించి వచ్చే ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా పూర్తి చేయడమే లక్ష్యంగా ముందుకెళ్తామన్నారు. సమావేశంలో కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దాక్షయాని, వైద్య, ఆరోగ్య శాఖ ఈఈ సుచరిత, డీఈలు జగదీష్, శివకుమార్, ఏఈ దీపక్, ఏఎంహెచ్‌వో డాక్టర్ హేమలత, ఇతర సిబ్బంది, స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.